తిరువీధుల్లో ఊరేగిన వెంకటాద్రి వాసుడు

విశాలాంధ్ర - పెందుర్తి : ఉత్తరాంధ్ర తిరుపతి పెందుర్తి వెంకటాద్రిపై బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఆలయ అర్చకులు శ్రీనివాసాచార్యులు ఆధ్వ ర్యంలో జరుగుతున్న శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం సాయంత్రం శ్రీవెంకటేశ్వర స్వామి తిరువీధి ఊరేగింపు మహోత్సవం ఘనంగా నిర్వహించారు. స్వామివారి సన్నిధి నుండి సుజాతనగర్ అలవేలుమంగా దేవి ఆలయం వరకు ఊరేగింపు తపెడగుళ్లు, కోలాటం, మేళ తాళలాతో అంగరంగ వైభవంగా సాగింది. ఈ కార్యక్రమంలో ఈఓ నీలిమ, అధిక సంఖ్యలో భక్తులు పాల్గున్నారు.

మైనింగ్ వద్దు... పర్యావరణమే ముద్దు

సీపీఎం విశాఖ జిల్లా కార్యదర్శి జగ్గు నాయుడు

విశాలాంధ్ర - ఆనందపురం : క్వార్ట్ జైట్ గనులు వెలికితీత పేరుతో కొండలను ,పర్యావరణాన్ని ధ్వంసం చేయడం రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నిలిపివేయాలని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం జగ్గు నాయుడు డిమాండ్ చేశారు. విశాఖ జిల్లా ఆనందపురం మండలం కుసులవాడ పంచాయతీలోని ఇచ్చాపురం గిరిజన గ్రామం దెయ్యాల మెట్ట కొండలను సిపిఎం భీమిలి జోన్ కార్యదర్శి ఆర్ఎస్ఎన్ మూర్తి, గ్రామ ప్రజలతో కలిసి దెయ్యాలమెట్ట కొండను, ప్రజల వ్యవసాయ భూములను, పంట తోటలను పరిశీలించారు. అనంతరం ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ క్వార్ట్ జైట్ గనుల నిక్షేపాలు వెలికితీతకు రాష్ట్ర ప్రభుత్వం అగ్నిసముఖ్ ప్రైవేట్ లిమిటెడ్ అను సంస్థకు 15 ఎకరాలు కొండ భూములను 20 సంవత్సరముల లీజుకు కట్టబెట్టేందుకు సిద్ధపడుతోందని, ప్రభుత్వం ఈ ప్రయ త్నాలను వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కొండ పరిసర భూముల్లో గిరిజన ప్రజలు వరి, కొబ్బరి, మామిడి, జీడి మామిడి ,అరటి, మునగ తదితర పంటలను సాగు చేస్తున్నారు. ఈ ప్రాంతంలో మైనింగ్ వల్ల వ్యవసాయం, పంటలు పూర్తిగా దెబ్బతింటాయి. ఈ ప్రాంత ప్రజల ఉనికికి ,జీవనోపాధికి ప్రమాదం ఏర్పడుతుంది. పశుసంపదకు, వన్య ప్రాణులకు హాని జరుగుతుంది. త్రాగునీరు, భూగర్భజలాలు, వ్యవ సాయ నీరు, గాలి కలుషితం అవుతాయి. ప్రజలు రోగాల బారిన పడతారు. కనుక రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే మైనింగ్ అనుమతులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గతంలో ఇదే మండలం కుసులవాడ పంచాయతీ చిన్నయ్య పాలెం గ్రామ పరిధిలో మైనింగ్ కు ప్రభుత్వం పూనుకుంటే ప్రజలు తిరస్కరించారు. అయినా ప్రభుత్వం తన ప్రయత్నాలను విరమించకుండా ఈసారి ఇచ్చాపురం గిరిజన గ్రామ కొండలను మైనింగ్ కు ఎంచుకోవడం దుర్మార్గం. కొండలను, పర్యావరణాన్ని కాపాడుతామని ఎన్నికల ముందు హామీ ఇచ్చి గెలిచిన టిడిపి జనసేన బిజెపి కూటమి ప్రభుత్వం, స్థానిక ప్రజా ప్రతినిధులు హామీలు మరిచి కొండలు మైనింగ్ కు అనుమతులు ఇవ్వడం ప్రజలను వంచించడమేనని అన్నారు. సిపిఎం భీమిలి జోన్ కార్యదర్శి ఆర్ ఎస్ ఎన్ మూర్తి మాట్లాడుతూ స్థానిక శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు ,పార్లమెంటు సభ్యులు ఎం శ్రీ భరత్ వెంటనే జోక్యం చేసుకొని మైనింగ్ అనుమతులను రద్దు చేయించాలని, తమను నమ్మి ఓట్లు వేసి గెలిపించిన ప్రజల పక్షాన నిలవాలని డిమాండ్ చేశారు.దెయ్యాల మెట్ట కొండ, ఇతర కొండలు ,పర్యావరణ ధ్వంసాన్ని ఈ ప్రాంతాల ప్రజానీకం తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని రాష్ట్ర ప్రభుత్వం మైనింగ్ అనుమతులు రద్దు చేయకుంటే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. అనంతపురం మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీలు ఇతర ప్రజాప్రతినిధులు పార్టీలకు అతీతంగా ప్రజలను, కొండలను, పర్యావరణాన్ని కాపాడాలని విజ్ఞప్తి చేశారు.

మేయర్ పీలా శ్రీనివాసరావుకు కార్పొరేటర్ ముమ్మన అభినందనలు

విశాలాంధ్ర - పెందుర్తి : గ్రేటర్ విశాఖ నగర మేయర్గా బాధ్యతలు చేపట్టిన పీలా శ్రీనివాసరావుకు బీజేపీ నేత జీవీఎంసీ 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు అభినందనలు తెలియ జేశారు. గురువారం ఉదయం పెందుర్తి లోని మేయర్ నివాసానికి బీజేపీ 95, 97వ వార్డుల అధ్యక్షులు చిక్కాల సతీష్, బిజెపి నాయకులు కంచిబోయిన వెంకట సంతోష్, విజయేంద్ర కృష్ణ, సుంకరి విజయ శేఖర్, విద్యాసాగర్, కెవిఆర్, రాపర్తి వాసు, రాపర్తి దుర్గాప్రసాద్, తవిటి నాయుడు, ముమ్మన సన్యాసి రావు, ముమ్మన సత్యనారాయణ, ముమ్మన శ్రీరామ మూర్తి, మోహన్, శివ, కెవిఆర్.లక్ష్మి, మాధవి, భవాని తదితరులతో కలిసి వెళ్లిన ముమ్మన దేముడు శ్రీనివాస రావును శాలువాతో సత్కరించి బొకే అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సంద ర్భంగా 95వ వార్డు సమస్యలను వివరించి, వాటి పరిష్కారానికి సహకరించాల్సిందిగా మేయర్కు కార్పొరేటర్ విజ్ఞప్తి చేశారు.

కార్మిక హక్కులు కాలరాస్తే సహించబోము

మహాసభలో తీర్మానం ప్రవేశపెడతాం : సీపీఐ

విశాలాంధ్ర - గాజువాక : విశాఖ నగరం లో ఈ నెల 10 ,11 తేదీలలో సీపీఐ జిల్లా 25 వ మహా సభలు జరుగు తున్నాయని సీపీఐ నాయకులు తాండ్ర కనక రాజు, ఏల్లెటి శ్రీనివాస్, జి. ఆనంద్ తెలిపారు.ఈ మేరకు గురువారం ఉక్కు సెంట్రల్ స్టోర్స్ వద్ద జిల్లా మహా సభలకు సంబందించిన గోడ పత్రికలను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఉక్కు ను ప్రభుత్వ రంగ పరిశ్రమ గా కొనసాగించాలని, 44 కార్మిక చట్టాలను 4 కోడ్ లుగా మార్చి కార్మిక వాక్కులను కాలరాసే చర్యలను సీపీఐ పార్టీ వ్యతిరేకిస్తున్న దని అన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా మహా సభలలో తీర్మానం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉక్కు ఏ.ఐ.టి.యూని అధ్యక్షులు కె.ఎస్.ఎన్రావు, డొక్కా నర్సింగరావు, జి.జయ, డి.వి.నాగ బాబు, బి.ఎంఎల్ నాయుడు, డి.దేముడు, శ్రీనివాస్, శివ, తేజ పాల్గొన్నారు.

మే 20న అఖిల భారత సమ్మెను విజయవంతం చేయండి

ఏఐటీయూసీ, సీఐటీయూ

విశాలాంధ్ర - విశాఖ : 20వ తేదీన సమ్మెలో అసంఘటిత రంగా కార్మికులు పాల్గొనాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు ఎం. మన్మధరావు, సిఐటియు ప్రధాన కార్యదర్శి ఎం . సుబ్బారావు కోరారు.పూర్ణా మార్కెట్ స్ప్రింగ్ రోడ్డు వద్ద ఏఐటీయూసీ, సీఐటీయు హమాలీ మేస్త్రీల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్మికులకు వ్యతిరేకంగా, కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా కార్మిక చట్టాలను మార్పులు చేయడానికి ప్రయత్నిస్తున్నదని విమర్శించారు. మే 20 న దేశంలో 50 కోట్ల మంది అసంఘటిత రంగ కార్మికులు సమ్మెకు సిద్ధమవుతున్నారని తెలిపారు. 29 కార్మిక చట్టాలను రద్దుచేసి వాటి స్థానంలో 4 లేబర్ కోడ్స్ తీసుకురావాలని చూస్తున్నారని చెప్పారు. ఇవి కార్మికుల ప్రయోజనాలను వ్యతిరేకంగా ఉన్నాయని పేర్కొన్నారు. సమ్మె చేసే హక్కును, సంఘాలు పెట్టుకునే హక్కును హరించాలని బిజెపి ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని, దీన్ని తిప్పికొట్టేందుకే ఈ సార్వత్రిక సమ్మె అని తెలిపారు. ఈ కార్యక్రమంలో బి.సాంబయ్య అప్పలనాయుడు, సూరిబాబు, శ్రీనివాసరావు, పైడిరాజు పాల్గొన్నారు.

జీవీఎంసీ యూసీడీ అధికారులతో నగర మేయర్ సమీక్ష

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం : విశాఖ నగరంలో అర్హులైన ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు జీవీఎంసీ యూసీడీ విభాగం సకాలంలో అందించాలని, మహిళల ఆర్థిక పురోగతికి సహకరిస్తూ చిత్తశు ద్ధితో అధికారులు విధులను నిర్వహించాలని నగర మేయర్ పీలా శ్రీనివాసరావు పేర్కొన్నారు. గురువారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఆయన చాంబర్లో జీవీఎంసీ అదనపు కమిషనర్లు డి.వి.రమణమూర్తి, ఎస్ ఎస్ వర్మ, ప్రాజెక్ట్ డైరెక్టర్ (యుసిడి) సత్యవేణి, ఇతర యుసిడి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అర్హులైన ప్రజలకు ఎన్నో ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తున్నారని వాటిని సక్రమంగా అర్హులైన ప్రజలకు అందించి ప్రభుత్వానికి జీవీఎంసీకి మంచి పేరుతో పాటు మంచి పాలన అందించేందుకు యుసిడి అధికారులు చిత్తశు ద్ధితో విధులు నిర్వహించి సహకరించాలన్నారు. నగరంలో ఏ ఏ కేటగిరీలో ఎన్ని ప్రభుత్వ పింఛన్లు పంపిణీ చేస్తున్నారని ఆరా తీశారు. నైట్ షెల్టర్లను రాత్రి 11 గంటల తర్వాత అధికారులు తనిఖీలు నిర్వహిం చాలన్నారు. నగరంలో ఉన్న 25 అన్నా క్యాంటీన్లను అధికారులు సందర్శించి భోజనం నాణ్యతను పరిశీలించాలని, నైట్ షెల్టర్ల తో పాటు అన్న క్యాంటీన్లను ఆకస్మికంగా తాను తనిఖీలు నిర్వహిస్తానని అధికారులకు మేయర్ తెలిపారు. అన్న క్యాంటీన్లో భోజనం చేసి భోజనం నాణ్యతను స్వయంగా పరిశీలిస్తానన్నారు. నగరంలో నిర్మించిన టిడ్కో గృహాలలో అనర్హులు ఉన్నారని చాలాచోట్ల టిడ్కో గృహాలు ఖాళీగా ఉన్నాయని మొత్తం టిడ్కో గృహాల జాబితా వాటి వివరాలు అందించాలని ప్రాజెక్ట్ డైరెక్టర్ (యూసిడి)ని ఆదేశించారు. కొంతమంది ఆర్పీలపై ఫిర్యాదులు వస్తున్నాయని, ఎటువంటి ఫిర్యాదులు లేకుండా ప్రజలకు మంచి సేవలు అందించేలా చర్యలు చేపట్టాలని యు సి డి అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ప్రాజెక్ట్ ఆఫీసర్లు డి. లక్ష్మీ, సూర్య కళ, డిపిఓలు హనుమంతు శంకర్, సురేష్, డిప్యూటీ తహసిల్దారు నాగలక్ష్మి, ఏపిడీలు ఇతర యుసిడి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నైతిక ప్రవర్తనకు సుమతీ శతకం ఎంతగానో తోడ్పడుతుంది

విశాలాంధ్ర - మల్కాపురం : నీతి వంతమైన జీవితాన్ని గడపడానికి చిన్న వయసు నుండి సుమతి శతకం, వేమన శతకం, కుమారీ శతకం, భాస్కర శతకం మొదలైనవి ప్రతి ఒక్కరూ అభ్య సించాలని ప్రముఖ న్యాయవాది జి.కె.వి. రాజు అన్నారు. స్థానిక మల్కాపురంలోని శాఖా గ్రంథా లయంలో నిర్వహిస్తున్న బాలల వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా గురువారం ఆయన సుమతీ శతకంలోని అనేక పద్యాలను తాత్పర్యాలతో సహా వివరించి, అవి జీవితానికి ఏ విధంగా ఉపయోగపడతాయో తెలియ జేశారు. సంపద కలిగినప్పుడే బంధువులంతా చుట్టూ చేరతారని, ఉపకారికి మాత్రమే కాకుండా అపకారికి కూడా ఉపకారం చేయాలని, తన కోపమే తనకు శత్రువు అని, ఎవరు చెప్పినా శ్రద్ధతో వినాలని కానీ వినిన వెంటనే నమ్మకుండా, విచక్షణతో మంచి చెడులను అంచనా వేసుకోవాలని ఆయన అన్నారు. అనేక నీతి సూత్రాలను తెలియజేశారు. ఇవి బాలలను ఎంతగానో అలరించాయి. కార్యక్రమానికి గ్రంథాలయ అధికారి వి.అజయ్ కుమార్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ- వేసవి శిబిరానికి ప్రముఖులు విచ్చేసి, చిన్నారులకు సందేశాలు ఇవ్వడం ఆనందించదగ్గ విషయం అని అన్నారు. కార్యక్రమం లో జాతీయ సేవా పథకం జిల్లా నోడల్ అధికారి ఇ.పి.ఎస్. భాగ్యలక్ష్మి, జాతీయ సేవా పథకం వాలంటీర్లు జ్యోతిర్మయి, సునీత తదితరులు ప్రసంగించారు. అనంతరం నీతి సూక్తులపై పోటీని నిర్వహించారు.

వెంకోజిపాలెంలో కళ్యాణ మండపం ప్రారంభం

విశాలాంధ్ర - విశాఖ : వెంకోజీపాలెంలోని ఆధునీకరించిన వీఎంఆర్డీఏ కళ్యాణ మండపాన్ని తూర్పు నియోజకవర్గం శాసనసభ్యులు వెలగపూడి రామకృష్ణ బాబు, వీఎంఆర్డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్ గోపాల్, మెట్రో పాలిటన్ కమీషనర్ కేఎస్ విశ్వనాథన్లు గురు వారం ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ ప్రణవ్ గోపాల్ మాట్లాడుతూ ఇది పేద, మధ్య తరగతి వర్గాలకు అందుబాటులో ఉండే కళ్యాణ మండపమని అన్నారు. తక్కువ సమయంలో దీన్ని ఆధునీకరించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కమీషనర్ రమేష్, ప్రధాన ఇంజనీర్ వినయ్ కుమార్, ప్రధాన గణాంకాధికారి హరిప్రసాద్, డీఎఫ్ఓ సుజాతా శివానీ, పర్యవేక్షక ఇంజనీర్ భవానీ శంకర్, కార్యనిర్వాహక ఇంజినీర్లు రామరాజు, సుధీర్, ఉప కార్య నిర్వాహక ఇంజనీర్ శిరీష, సహాయక ఇంజనీర్ శర్మ పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాల నిర్వహణ - బాధ్యతలపై అవగాహన కార్యక్రమం

విశాలాంధ్ర - పెదగంట్యాడ : ఈరోజు పాఠశాల విద్యా ప్రాంతీయ సంచాలకులు శ్రీ బి విజయ భాస్కర్ ఆపిల్ ఐ స్కూల్ ఆవరణలో గాజువాక, పెదగంట్యాడ మండలాలలోని ప్రైవేట్ స్కూల్ కరెస్పాండంట్స్తో ఒక ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిధిగా పాల్గొని పాఠశాల నిర్వహణ కు సంభందించిన పలు సూచనలు చేసారు. ఆర్టిఈ యాక్ట్ ద్వారా 25% ఉచిత అడ్మిషన్లు తప్పనిసరి ఇవ్వాలని ఆర్ జెడి అన్నారు. ఆర్ టీ ఈ యాక్ట్ ద్వారా వచ్చిన ఉచిత అడ్మిషన్స్ ప్రతీ పాఠశాల వారు అనుమతించాలని, వారికి ప్రభుత్వమే ఫీజు లు తప్పకుండా చెల్లిస్తుందని తెలిపారు. ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన ఫారం 1 ద్వారా ప్రతీ పాఠశాల యొక్క పూర్తి వివరాలు ఆన్లైన్ ద్వారా సకాలంలో అందించాలని సూచించారు. మార్కులు లేదా చెల్లించే ఫీజు ఆధారంగానో విద్యార్థులపై వివక్ష చూపరాదని అందరినీ సమానంగా చూడాలని సూచించారు. డి ఈ ఓ యస్ ప్రేమ కుమార్ గారు మాట్లాడుతూ ప్రైవేట్ స్కూల్స్ విద్యావ్యవస్థ లోని భాగమేనని కనుక ప్రభుత్వం సూచించిన ప్రతీ విషయం తప్పకుండ అమలు చేయాలనీ, పాఠశాల నిర్వహణ లో ప్రధాన మైన రికార్డ్స్ అన్ని సరిగా నిర్వహిస్తూ వుండాలని, విద్యార్థుల పూర్తి వివరాలు, మార్కులు మొదలైనవి ఆఫ్ లైన్తో పాటు ఆన్లైన్లో కూడా సకాలంలో పొందుపరచాలని సూచించారు. కార్యక్రమం లో జిల్లా ఉప విద్యాశాఖాధికారి సోమేశ్వరరావు, గాజువాక, పెద్ద గంట్యాడ మండలాల యమ్ ఈ ఓ లు యమ్ సునీత, విశ్వనాథం, రమణాజీ మరియు జిప్సా సంఘ నాయకులు పి భాస్కర రావు, బి.శ్రీనివాసరావు, యమ్ బాబురావు లతో పాటు సుమారు 150మంది వివిధ పాఠశాలల కరెస్పాండంట్స్ పాల్గొన్నారు.

కమనీయంగా ఆర్జిత సేవలు

విశాలాంధ్ర - సింహాచలం : ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహ లక్ష్మీ నృసింహ స్వామి వారి ఆలయంలో వేదపండితుల వేదమంత్రాల, నాదస్వర మంగళ వాయిద్యాలతో శాస్త్రోక్తంగా స్వర్ణ పుష్పార్చన, నిత్య కళ్యాణం కమనీయంగా నిర్వహించారు. ప్రధాన అర్చకులు అర్చకులు శ్రీనివాసాచార్యులు ఆదేశాల మేరకు ఏ.ఈ.ఓ ఆనంద్ కుమార్ పర్యవేక్షణలో అర్చక స్వాములు వేకువ జామున స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ప్రాతఃకాల పూజలు సాంప్రదాయ బద్ధంగా నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ గోవింద రాజు స్వామి వారిని సర్వాంగ సుందరంగా అలంకరించి ఆలయ కల్యాణ మండపము లో వేదికపై అధిష్ఠింపజేసి వేద మంత్రాలు నాధ స్వర మంగళ వాయిద్యాల నడుమ శ్రీ స్వామి వారి స్వర్ణ పుష్పార్చన ఆర్జిత సేవలు కమనీయంగా జరిగాయి. ఆర్జిత సేవల్లో భాగంగా ఉత్సవ మూర్తి గోవింద రాజ స్వామిని మండపంలో అధిష్టింప జేశారు. పాల్గొన్న భక్తుల, గోత్రనామాలతో సంకల్పం చెప్పి పాంచరాత్ర ఆగమశాస్త్ర ప్రకారం సేవలను జరిపించారు. మంత్రపుష్పం, మంగళా శాసనాల తర్వాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

కొండవాలు ప్రాంతంలో రక్షణ గోడ నిర్మాణానికి మేయర్ శంకుస్థాపన

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం : విశాఖ నగరాభివృద్ధి ధ్యేయంగా నగరంలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించడం జరుగుతున్నదని నగర మేయర్ పీలా శ్రీనివాసరావు పేర్కొన్నారు. గురువారం ఆయన 3వ జోన్ 15వ వార్డు పరిధిలోని వెంకోజీపాలెం కొండ వాలు ప్రాంతాలలో పలు రక్షణ గోడల నిర్మాణానికి తూర్పు నియోజకవర్గ శాసనసభ్యులు వెలగపూడి రామకృష్ణబాబు, విఎంఆర్డిఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్, స్థానిక కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్యతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ విశాఖ నగర అభివృద్ధికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎంతో కృషి చేస్తున్నారని, విశాఖను ఆర్థిక రాజధానిగా తీర్చిదిద్దేందుకు పలు కంపెనీలను నగరంలో నెలకొల్పుతున్నారని తెలిపారు. వెంకోజీ పాలెం కొండ వాలు ప్రాంతాల్లో రక్షణ గోడలు చాలా అవసరం ఉన్నందున కార్పొరేటర్ సూచనల మేరకు 15వ వార్డులో రూ. 3.5 కోట్ల అంచనా వ్యయంతో పలు కొండ వాలు ప్రాంతాలలో రిటైనింగ్ వాల్స్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్నారు. ఈ రక్షణ గోడల నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించి సంబంధిత కాంట్రాక్టర్లు అలసత్వం వహించకుండా త్వరితగతిన పూర్తి అయ్యేలా చూడాలని జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారులను మేయర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మూడవ జోన్ జోనల్ కమిషనర్ శివప్రసాద్, కార్యనిర్వాహక ఇంజనీరు గంగాధర్, సచివాలయం కార్యదర్శులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

అగ్నికి ఆహుతైన చెత్త సామాగ్రి దుకాణం

విశాలాంధ్ర - అనందపురం : గుడిలోవ వద్ద ఘటనమండలంలో గుడిలోవ నేషనల్ హైవే ఆను కొని ఉన్న చెత్త దు కాణం పూర్తిగా అగ్నికి ఆహుతి అయింది. గురు వారం ఉదయం ప్రక్కనే ఉన్న ఎండిన కలవను కొందరు వ్యక్తులు అంటిం చడంతో మంటలు నేరుగా దుకాణం వైపు పాకాయినీ ఈ సంఘటలో ఎవరికి ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదు ఆస్తి నష్టం జరిగినట్లు తెలిపారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు.

మోదీ యుద్ధం మొదలైంది ... లక్ష్యం నెరవేరే వరకు ఆగదు

బీజేపీ బీసీ నేత మూల వెంకట్రావు

విశాలాంధ్ర - పెందుర్తి : శాంతికి మారుపేరుగా నిలిచే ప్రధాని నరేంద్ర మోడీ యుద్ధం మొదలుపెట్టారు లక్ష్యం నెరవేరే వరకు ఆగదు అని బిజెపి బీసీ నేత మూల వెంకటరావు స్పష్టం చేశారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా అపర యోధుడు ప్రధాని మోదీ నాయకత్వంలో గట్టి సమాదానం ఇచ్చామని, సాయుధ దళాలు ఒక్కటై శతృదేశాన్ని మట్టి కరిపించడం పట్ల యావత్ భారతావని సంతోషంతో ఉందని పేర్కొన్నారు. మోదీ నాయకత్వంలో భారత ప్రభుత్వం తీసుకున్న సైనిక చర్యను, భారతీయులతో పాటు ప్రపంచ దేశాలు కూడా హర్షిస్తున్నాయని వెల్లడించారు. భారతీయులు సిందూరాన్ని సంప్రదాయ తిలకంగా మాత్రమే కాకుండా సంకల్పానికి చిహ్నంగా వాడుతారని తెలిపారు. ఎన్ని సవాళ్ళు ఎదురైనా, గతంకంటే బలంగా శత్రుమూకలను మన సైన్యం ఎదుర్కొంటుందని పేర్కొన్నారు. భారతసైన్యం, వైమానిక దళం, వాయుసేన, సరిహద్దు దళాల్లోని ప్రతి ఒక్క సైనికుడికి వందనాలు సమర్పిస్తున్నట్లు వెల్లడించారు. సైనికుల ధైర్య సాహసాలు ప్రజల గర్వాన్ని మరింత పెంచాయని, వారిని చూసి దేశమంతా గర్విస్తోందని తెలిపారు. భద్రతా దళాలకు దేశంలోని ప్రతి ఒక్కరూ మద్దతుగా ఉన్నారని, మోదీ విదేశాంగ విధానానికి ప్రపంచదేశాల మద్దతు పరిపూర్ణంగా లభిస్తుందని తెలిపారు. ఉక్కు సంకల్పంతో భారతదేశం తనను తాను ఎలా రక్షించుకుంటుందో ప్రపంచానికి చాటిచెప్పగలిగామని పేర్కొన్నారు. ఉగ్రవాదానికి సరైన బుద్ధి చెప్పిన మోదీ నాయకత్వంలోని భారత సైనిక దళాలకు భారతీయులందరూ సంఘీభావం తెలపాలని మూల వెంకట్రావు పిలుపునిచ్చారు.

వివాహిత అదృశ్యంపై ఫిర్యాదు

విశాలాంధ్ర - ఆనందపురం : మండలంలోని దుక్కవాని పాలెం సమీపంలో నివాస ముంటున్న మహిళ అదృశ్య మైనట్లు తల్లి సకినా స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. బీహార్కి చెందిన రుక్సాన ఖాటున్ (25) మండలంలోని దుక్కవాని పాలెం వద్ద నివాసం ఉంటున్నారు. ఇలా ఉండగా ఆమెకు వివాహమై 3 సంవత్సరాల బాబు కూడా ఉన్నారు. ఇలా ఉండగా ప్రైవేట్ కంపెనీలో పనులు చేస్తుందేదనీ మార్కెట్కి వెళ్తానని గత నెల 10న తన కుమా రుడిని తీసుకొని ఇంటి నుండి బయలుదేరి వెళ్ళింది అప్పటి నుండి ఇంటికి తిరిగి రాలేదు తల్లి షకీలా సమీపంలోనూ బంధువుల ఇంటి వద్ద ఎంక్వైరీ చేసిన సమాచారం లేకపోవడంతో స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసింది పోలీసులు కేసు నమోదు చేశారు. ఆచూకీ తెలిసినవారు స్థానిక పోలీస్ స్టేషన్లో గాని లేదా 7416284831 నెంబర్కు సమాచారం అందించగలరని తెలిపారు.

యూనియన్ బ్యాంక్ ద్వారా రైతులకు రుణాలు : డీజీఎం నరసింహ కుమార్

విశాలాంధ్ర - అనందపురం : వ్యాపారస్తులకు, రైతులకు గ్రామీణ ప్రాంతాల్లో తక్కువ వడ్డీతో వ్యవసాయ రుణాలు యూనియన్ బ్యాంక్ ద్వారా రైతులకు సంబంధించి ట్రాక్టర్స్, వ్యవసాయ పనిముట్లు, మొదలగు వాటికి రుణ సదుపాయం కల్పిస్తామని బ్యాంక్ డీజీఎం నరసింహ కుమార్ తెలిపారు. ఆనందపురం గ్రామంలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో వ్యవసాయానికి సంబంధించిన రుణాలకు సంపూర్ణ సహకారం అందిస్తామని ఇది వరకు 10 లక్షలు లోన్ తీసుకున్న వారికి ఇప్పుడు 20 లక్షలు వరకు అతి తక్కువ వడ్డీతో సదుపాయం కల్పి స్తామని, తక్కువ సమయంలో రుణం, వ్యవసాయం బంగారంకు రుణాలు కల్పిస్తామని, లక్ష రూపాయలు విలువగల బంగారానికి 85 వేలు రుణం అందిస్తామని గ్రామాల్లో మాత్రమే ఇవి అందుబాటులో ఉంటాయని రైతులు సద్వినియోగం చేసుకోవచ్చని తెలిపారు. ముఖ్యంగా మంచి సేవలను బ్యాంక్ అందిస్తున్న తరుణంలో రైతులు భూమికి సంబంధించి సరైన పత్రాలు నిర్ణీత సమయంలో అందించినట్లయితే తక్కువ సమయంలో రుణాల అందిస్తామని స్వయం సహాయక బృందాల ద్వారా వ్యాపార అవసరాలకు ప్రతి సంవత్సరం బ్యాంకు ద్వారా వ్యవసాయాన్ని పెంపొందించుకోవాలని తెలిపారు. అలాగే సంవత్సరం లోపు తీసుకున్న రుణాలకు వడ్డీ సకాలంలో తెలిస్తే అత్యవసర రుణాలకు ఆస్కారం ఉంటుందని, మరల రుణాలకి అప్లై చేసుకున్న తక్షణ సదుపాయం బ్యాంక్ కల్పిస్తుందని, కిసాన్ తత్కాల్ పథకం ద్వారా 50% రుణ సదుపాయం సకాలంలో అందిస్తారని సంబంధించిన పనిముట్లు రైతులు రుణాల ద్వారా పొందవచ్చు. కిసాన్ క్రెడిట్ కార్డ్స్ వ్యవసాయానికి సంబంధించి కిసాన్ క్రెడిట్ కార్డు ద్వారా రుణాలు ప్రతి సంవత్సరం స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ 0 వడ్డీ రాయితీతో రుణాలు అందిస్తారని తెలిపారు. కౌలు రైతులకు కూడా రుణ సదుపాయాలుకు మార్గదర్శకాలు ఉన్నాయని పంట దిగుబడి అంచనాల ప్రకారం ప్రతి రైతుకు వ్యవసాయం సంబంధించిన రుణాలు అందజేస్తామని, బ్యాంక్ అధికారులు సంప్రదించినట్లయితే తక్కువ సమయంలో రుణాల పొందవచ్చు అని తెలిపారు. ఈ సందర్భంగా మహిళలతో మాట్లాడారు. రుణాలు పొందిన వారికి పత్రాలు డీజీఎం చేతుల మీదగా అందజేశారు. కార్యక్రమంలో డీజీఎం నరసింహ కుమార్, ఏజి ఎం పీయూష్, బ్రాంచ్ మేనేజర్ ఉమాపతి, మండల వ్యవసాయ అధికారి సంధ్యరత్న ప్రభ, ఏపిఎం ఆదినారాయణ, ఎఫ్ఐ డిపార్ట్మెంట్ ఆర్వో ఫణి కుమారి, భాస్కర్, చీఫ్ మేనేజర్ క్రెడిట్ అబ్దుల్ అలీమ్, ముఖ్య అతిధులు శ్రీ నాదు నారాయణరావు, కే.రెడ్డిబాబు, మీసాల సత్యనారాయణ, సూర్య నారాయణ వెంకట్రావు అప్పలనాయుడు శ్రీను వివిధ సంఘాలు ప్రతినిధులు పాల్గొన్నారు.

రక్తదానం చేసిన కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, డీఆర్వో భవానీ శంకర్

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్ : జిల్లా యంత్రాంగం, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరానికి దాతల నుంచి విశేష స్పందన లభించింది. జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, జిల్లా రెవెన్యూ అధికారి బీహెచ్ భవానీ శంకర్, ఇతర అధికారులతో పాటు మొత్తం 149 మంది దాతలు ముందుకొచ్చి స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. గురువారం వరల్డ్ రెడ్ క్రాస్ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా యంత్రాంగం, ఇండియన్ రెడె క్రాస్ సొసైటీలు జిల్లా కలెక్టరేట్ పరిధిలోని ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ భవనంలో, జిల్లా పరిషత్ కూడలిలో ఉన్న ఇండియన్ రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంకులో వేర్వేరుగా శిబిరాలు ఏర్పాటు చేశాయి. రక్తదాన ఆవశ్యకతను తెలుపుతూ జిల్లా కలెక్టర్ పిలుపు ఇవ్వడంతో జిల్లాలోని వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది స్వచ్ఛందంగా ముందుకు వచ్చారు. కలెక్టరేట్ శిబిరంలో 143 మంది, రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంకులో ఆరుగురు రక్తదానం చేశారు. ఈ మేరకు రెడ్ క్రాస్ ప్రతినిధులు, ఆదిలీల ఫౌండేషన్, కలెక్టరేట్ అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ క్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి బీహెచ్ భవానీ శంకర్ తో కలిసి రక్తదానం చేసిన జిల్లా కలెక్టర్ అందరిలో స్ఫూర్తినింపారు. కార్యక్రమంలో ఇండియ్ రెడ్ క్రాస్ సొసైటీ సెక్రటరీ రవికుమార్, రావు, ఆదిలీల ఫౌండేషన్ ప్రతినిధి ఆదినారాయణ రాజు, కలెక్టరేట్ ఏవో ఈశ్వరరావు, ఇతర అధికారులు, ఉద్యోగులు, వైద్యాధికారులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

ఎంపీడీవో విజయ్‌కుమార్ ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర - పద్మనాభం : పద్మనాభ మండలం లోని రేవిడి, పాండ్రంగి గ్రామ పంచాయతీలలో గురువారం స్థానిక ఎంపీడీవో ఎమ్.విజయ్ కుమార్ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ప్రభుత్వ సర్వే కార్యక్రమాలు, సర్వేల పురోగతి, రికార్డులు పరిశీలన మొదలగు తనిఖీలు నిర్వహించారు. పంచాయతీ కార్య దర్శులకు మరియు సచివాలయ సిబ్బందికి భారతీగతిన సర్వేలన్నీ పూర్తి చేయాలని ఆదేశాలు ఇవ్వడం జరిగినది. రేషన్ కార్డులకు సంబంధించి తగు సూచనలు సలహాలు చేయడం జరిగినది. ఏడు రకాల రేషన్ కార్డు లకు, క్షుణ్ణంగా పరిశీలించి ఎటువంటి తప్పులు జరగకుండా ఖచ్చితంగా లబ్ధిదారులకు రేషన్ కార్డులు అందజేయాలని దీన్ని దృష్టిలో పెట్టుకొని రేషన్ కార్డులకు అప్లై చేయాలని సచివాలయ సిబ్బందికి తెలియజేశారు.

ఈపీడీసీఎల్ ఆపరేషన్స్ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన సూర్య ప్రకాష్

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం : ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్తు పంపిణీ సంస్థ (ఏపీఈపీడీసీఎల్) ఆపరేషన్స్ డైరెక్టర్ గా టి వి సూర్య ప్రకాష్ గురువారం సంస్థ కార్పొరేట్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. 1986 లో ఏపీఎస్ఈబి కేటీపీఎస్ లో అసిస్టెంట్ ఇంజనీర్ గా చేరిన సూర్య ప్రకాష్ వివిధ విభాగాల్లో విధులు నిర్వర్తిస్తూ ఏపీఈపీడీసీఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ హోదాలో 2021 లో పదవీ విరమణ చేసారు. ఈపీడీసీఎల్ డైరెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం సూర్య ప్రకాష్ మాట్లాడుతూ తన సేవలను గుర్తించి విద్యుత్ పంపిణీ వ్యవస్థ లో అతి కీలకమైన ఆపరేషన్ విభాగానికి డైరెక్టర్ గా నియమించిన ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు, విద్యుత్ శాఖామాత్యులు గొట్టిపాటి రవికుమార్, చీఫ్ సెక్రటరీ కె.విజయానంద్, సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి, ఇతర అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. 1994 నుంచి 2011 వరకు ఆపరేషన్ విభాగంలో ఏఈ, ఏడిఈ, డిఈ గా ఉభయ గోదావరి జిల్లాలలోని నరసాపురం, పాలకొల్లు, భీమవరం, రాజమండ్రి ప్రాంతాలలోను, ఏలూరు, విశాఖపట్నం, రాజమండ్రి సర్కిళ్ల లో సూపరింటెండెంట్ ఇంజనీర్ గా 2021 వరకు పని చేసిన అనుభవంతో వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడంతోపాటు రైతులకు పగటిపూట 9 గంటల ఉచిత విద్యుత్, అదేవిధంగా గ్రామీణ ప్రాంతాలకు 24%ళ%7 3-ఫేస్ విద్యుత్ ను అందించేందుకు కృషి చేస్తానన్నారు. ఆపరేషన్స్ డైరెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన సూర్య ప్రకాష్ ను సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి, డైరెక్టర్లు డి చంద్రం, టి వనజ అభినందించారు. సంస్థ సీజీఎం లు, ఉద్యోగులు, పలు యూనియన్, ఉద్యోగ సంఘాల నాయకులు సూర్య ప్రకాష్ కు అభినందనలు తెలియజేశారు.

భారత్ పంతం - పాక్ టెర్రరిజం అంతం : మాజీ మంత్రి అవంతి

విశాలాంధ్ర - తగరపువలస : త్రివిద దళాలు చేపట్టిన ఆపరేషన్ సిందూర్ విజయ వంతం చేసినందుకు త్రివిద దళాలు కు మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు శుభాకాంక్షలు తెలిపారు. ఆపరేషన్ సిందూర్ పై ఆయన స్పందిస్తూ పెహల్గాం అమాయక ప్రజల పై మతం అడిగి మరీ విచక్షణా రహితంగా కాల్పులు జరిపి చంపి భారత స్త్రీలతో వెళ్ళి మోదీ కి చెప్పుకోండి అని అనడంతో తమ భర్తలు ను కోల్పోయిన భార్యలు వెళ్ళి మోదీ కి చెప్పడంతో భారత ప్రధాని మోదీ మేము టెర్రరిజం కి వ్యతిరేకం మా యుద్ధం పాకిస్థాన్ దేశంతోనో - పాలకులు తోనో - ప్రజలు తోనో కాదు మా యుద్ధం ప్రపంచానికి పట్టిన టెర్రరిజం అనే భూతం తో అని వారు చేసిన దాడి ఘటనకు ప్రతి స్పందన గా "ఆపరేషన్ సిందూర్" పేరిట పాక్ ఆక్రమిత కాశ్మీర్లో టెర్రరిస్టులు ఏర్పాటు చేసుకున్న 9 క్యాంప్ లపై వైమానిక దాడులు జరిపి 100 మంది టెర్రరిస్టులతో పాటు వారి ఉగ్రవాద కార్యకలాపా స్థావరాలను ధ్వంసం చేయడం జరిగింది.మన దేశ సార్వభౌమత్వాన్ని కాపాడుకోవాలి - దేశ ప్రజలను రక్షించుకోవాలి అంటే ఇలాంటి కఠినమైన చర్యలు తప్పకుండా భవిష్యత్తు లో కూడా తీసుకోవాలని టెర్రరిజం పై పోరాటంలో దేశం అంతా ఓకె తాపిపై నిలిచి అండగా నిలబడటం గర్వించదగ్గ విషయం అని మాట్లాడారు. అనంతరం భారత మాతా కి జై మేరా భారత్ మహాన్ అంటూ నినాదాలు పలికారు.

టైటాన్స్ స్టోర్లో పరిమళం తయారీ కేంద్రాలు

విశాలాంధ్ర - విశాఖపట్నం : జ్ఞాపకాలను రేకెత్తించే శక్తివంతమైన మార్గాన్ని సెంట్ (సువాసన)తో మాతృదినోత్సవ సందర్భంగా, టైటాన్ వరల్డ్ ఆ ప్రియమైన బంధాన్ని ఆమె ఎల్లప్పుడూ గుర్తుంచు కునే బహుమతితో, ఆమె ప్రేమ వలె కలకాలం ఉండే పరి మళంతో గౌరవించమని మిమ్మల్ని ఆహ్వానిస్తుంది. ఆ శాశ్వత బంధాన్ని ఆలోచనాత్మకంగా తీర్చిదిద్దిన స్టోర్ లోపలి అనుభవం ద్వారా వేడుక జరుపు కుంటుంది. మే 10 మరియు 11 తేదీలలో, భారతదేశ వ్యాప్తంగా 163 కి పైగా టైటాన్ వరల్డ్ స్టోర్‌లు ప్రత్యేకమైన పరిమళం తయారీ కార్యకలాపాలను నిర్వహించనున్నాయి. ఇది కస్టమర్‌లు తమ జీవితాల్లో అత్యంత ప్రియమైన మహిళ తమ తల్లితో చిరస్మరణీయమైన క్షణాలను సృష్టించడంలో సహాయ పడటానికి రూపొందించబడింది. ఈ కార్యకలాపం అతిథులను సువాసన మిశ్రమం యొక్క కళలో పాల్గొనమని ఆహ్వానిస్తుంది, ప్రత్యేకంగా ఎంపిక చేసిన ముఖ్యమైన నూనెలను ఉపయోగించి వ్యక్తిగతీకరించిన 50మిల్లీ లీటర్ల పరిమళం ను రూపొందించడానికి వీలు కల్పిస్తుంది.

సెంట్రల్ పార్కులో మ్యూజికల్ ఫౌంటెన్ పునరుద్ధరణ

విశాలాంధ్ర - విశాఖ : సిటీ సెంట్రల్ పార్కులో మ్యూజికల్ ఫౌంటెన్ ను సుమారు రూ 22.50 లక్షల రూపాయల వ్యయంతో పునరుద్ధరించారు. విశాఖ దక్షిణశాసన సభ్యులు వంశీ కృష్ణ శ్రీనివాస్ యాదవ్, వీఎంఆర్డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్ గోపాల్, మెట్రోపాలిటన్ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్ గురువారం దీన్ని ప్రారంభించారు. నూతన పాటలతో రూపొందించిన ఫౌంటెన్ సెంట్రల్ పార్క్ కు వచ్చే సందర్శకులలకు అదనపు ఆకర్షణగా ఉంటుందని వారు తెలిపారు. దీని వల్ల పార్కుకు వచ్చే సందర్శకుల సంఖ్య పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కమీషనర్ రమేష్, ప్రధాన ఇంజనీర్ వినయ్ కుమార్, పర్యవేక్షక ఇంజనీర్ భవానీ శంకర్, కార్యనిర్వహక ఇంజినీర్ రామరాజు పాల్గొన్నారు.

అదర గొట్టిన భారత సైన్యం..!!

విశాలాంధ్ర - అనందపురం : పహల్గంలో పాకిస్తాన్ ఉగ్రమూకలు చేసిన దాస్టికానికి ప్రతీకగా భారత ప్రభుత్వం ఆపరేషన్ సింధూర పేరిట నిర్వహించిన ఆపరేషన్ భారత్ సత్తాను పాకిస్తాన్‌కి రుచి చూపించిందని డిసిసి అధ్యక్షుడు అడ్డాల వెంకట వర్మ రాజు అన్నారు. గురువారం ఆయన స్థానిక మీడియాతో మాట్లాడారు.ఉగ్ర మూకలను ఏరి పారేయడంలో భారత సైన్యం ప్రదర్శించిన ధైర్య సాహసాలు అజరామరం. ఉగ్ర దాడులకు పాల్పడిన, వారికి సహకరించిన దేశాలకు ప్రధానంగా పాకిస్తాన్ కు ఇదొక హెచ్చరిక లాంటిదని వర్మ రాజు పేర్కొన్నారు. ఆపరేషన్ సింధూరలో పాల్గొన్న ప్రతి భారతీయ సైనికుడికి పార్టీ తరఫున సెల్యూట్ చేస్తు న్నామని తెలియజేశారు. ఉగ్రదాడిని నిరోధించడానికి భారత ప్రభుత్వానికి ఎప్పుడూ తమ పార్టీ అండగా ఉంటుందన్నారు. అలాగే మన సాయుధ దళాలను చూసి గర్విస్తున్నానని జైహింద్ పలుకుతూ వ్యాఖ్యానించారు.

సాంసంగ్ విజన్ ఏఐ టెక్నాలజీతో ఆవిష్కరణలు

విశాలాంధ్ర - విశాఖపట్నం : విజన్ ఏఐ టెక్నాలజీని అందుబాటులోకి తీసుకు వస్తున్నట్టు ప్రముఖ ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ సామ్‌సంగ్ విజువల్ డిస్ప్లే బిజినెస్ సీనియర్ డైరెక్టర్ విప్లవేష్ డాంగ్ అన్నారు. అల్ట్రా ప్రీమియం 2025 మోడళ్ల నియో క్యూ ఎల్ఈడి 8కే, నియో క్యూ ఎల్ఈడి 4కే, ఓఎల్ఈడి, క్యూఎల్ఈడీ టీవీలు ది ఫ్రేమ్ లైనప్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇది విప్లవాత్మకమైన సామ్‌సంగ్ విజన్‌ఏఐ టెక్నాలజీని భారతీయ వినియోగ దారులకు అందుబాటులోకి తీసుకు వస్తుందన్నారు. ఈ ఆవిష్కరణలో ప్రధాన ఆకర్షణగా కొత్త సామ్‌సంగ్ విజన్ ఏఐ నిలుస్తుంది, ఇది తదుపరి తరం ఏఐ సామర్థ్యాలతో అసమానమైన గృహ వినోద అనుభవాన్ని అందిస్తుంది. ఆవిష్కరణ పట్ల దాని నిబద్ధతకు కట్టుబడి, సామ్‌సంగ్ యొక్క తాజా శ్రేణి వినియోగ దారులు స్క్రీన్‌లతో ఎలా సంభాషిస్తారో పునర్నిర్వచిస్తుందన్నారు. సామ్‌సంగ్ విజన్ ఏఐ అత్యాధునిక సాంకేతిక కార్యాచరణను వ్యక్తిగతీ కరించిన అనుభవంతో గరిష్ట పనితీరు కోసం ఏఐ మెరుగైన చిత్రం మరియు ధ్వనిని జత చేస్తుందని, సామ్‌సంగ్ విజన్ ఏఐ మూడు స్తంభాలపై నిర్మించబడిందన్నారు.

అందుబాటులోకి అమెజాన్ సీజనల్ సేవింగ్స్

విశాలాంధ్ర - విశాఖపట్నం : వేసవి సీజన్ సేల్ సందర్భంగా అమెజాన్ ఫ్రెష్ పలు ఉపకారణాలను రాయితీపై అందిస్తున్నట్టు ఆ సంస్థ ప్రతినిధి చెప్పారు. ఇంటిగుమ్మం వద్దకు వేగంగా, నమ్మకంగా, 2 గంటల్లోనే డెలివర్ చేయగలిగే సౌలభ్యంతో పాటు స్లాటెడ్ డెలివరీ సౌకర్యంతో పాటుగా చేరుస్తుందన్నారు. వారం వారం సూపర్ వాల్యూ డేస్‌తో, ప్రతి శుక్రవారం నుండి ఆదివారం వరకు లైమ్‌గా, కస్టమర్లు గొప్ప డీల్సును మరియు వాల్యూ ఆఫర్లను పొంది ఆనందించవచ్చు అన్నారు. తద్వారా, కిరాణా సరుకుల అవసరాల పై భారీగా సొమ్ము ఆదా అవుతుందన్నారు. అమెజాన్ ఫ్రెష్ వారి ప్రత్యేకంగా రూపొందించిన మ్యాంగో మానియా స్టోర్ తో సీజన్‌లో అత్యంత తియ్యని రుచులను ఆస్వాదించి, 10కి పైగా మామిడి రకాలు, డెసర్ట్స్, క్యాండీలు, డ్రింకులు ఇంకా మరిన్నింటి పై భారీగా రాయితీలు అందిస్తున్నామన్నారు. నమ్మకమైన రైతుల నుండి ప్రత్యక్షంగా సేకరించిన, 260కి పైగా ఈ మామిడి పండ్లను సురక్షితమైన పద్ధతిలో, కార్బైడ్ లేకుండా మాగబెడతారని, కోకా కోలా హెరిటేజ్ వారి ప్రాయోజిత 4-అంచెల నాణ్యతా తనిఖీలను నిర్వహిస్తారన్నారు. అమెజాన్ ఫ్రెష్ లోని క్రికెట్ రెడీ స్టోర్, ప్రతి మ్యాచ్ రోజు కోసం ఒక ప్రత్యేకమైన స్నాకింగ్ డెస్టినేషన్‌ను ఆఫర్ చేస్తోందని చెప్పారు.

71 ఏళ్ల వయసులో సంస్కృతి భారతి పరీక్ష రాసిన వైద్యుడు
ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణుడైన జ్ఞానానంద

విశాలాంధ్ర - పెందుర్తి : చదువుకోవాలనే జిజ్ఞాస ఉంటే వయసు అడ్డు కాదని నిరూపించారు 71 ఏళ్ల హెూమియో వైద్యుడు డాక్టర్ జ్ఞానానంద. సాంస్కృత భారతి రెండేళ్ల కోర్సు ప్రవేశ పరీక్ష రాసి, ఫలితాల్లో ప్రథమ శ్రేణి సాధించి తన విద్యాభిలాషను చాటు కున్నారు శ్రీకాకుళం జిల్లా కవిటి గ్రామానికి చెందిన ప్రముఖ హెూమియో వైద్యుడు డాక్టర్ బి.జ్ఞానానంద. రిటైర్డ్ మెడికల్ ఆఫీసర్ అయిన జ్ఞానానంద ఏడు పదులు దాటి ఎక్కడో మూల కూర్చొని హరే రామ హరే కృష్ణ అనుకుంటూ ఖాళీగా ఉండలేదు. 71 ఏళ్ల వయసులోనూ ఏదైనా సాధించాలని తపనపడ్డారు. ఆయన పట్టుదలకు వయసు అడ్డు రాలేదు. సంకల్పం ఉంటే విజయం సాధించదానికి వయసుతో సంబంధం లేదనుకున్నారు. అదే దృక్పథంతో చదువుపై ఆసక్తి పెంచుకున్నారు. ఒకవైపు వైద్యుడిగా సేవలందిస్తూనే నిత్యం చదువుపై దృష్టి పెట్టారు. ఆ సంకల్పంతోనే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహించిన సాంస్కృత భారతి రెండేళ్ల కోర్సు ప్రవేశ పరీక్ష రాసి ఫలితాల్లో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించారు. పరీక్షల్లో సత్తాచాటిన డాక్టర్ జ్ఞానానందకు చిన్నాన్న రిటైర్డ్ హెడ్ మాస్టర్ బందరు ఉమామహేశ్వరరావు, ఆరంగి రాజు, బెందాళం చిట్టిబాబు, దిక్కల నారాయణ, కొమ్మోజు కుమార్ స్వామి తారకేశం నరసింహమూర్తి ఆచారి అనుపోజు తులసీదాస్ విశ్వబ్రాహ్మణ కమిటీ పెద్దలు, కుటుంబీకులు, బంధువులు స్నేహితులు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ బందరు జ్ఞానానంద మాట్లాడుతూ, చదువుకు వయసుతో సంబంధం లేదని, చదువుకునే ఆసక్తి ఉంటే ఇలాంటి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించడం కష్ట సాధ్యం కాదన్నారు. నేటి యువత చదువుపై ప్రత్యేక దృష్టి పెట్టి సమాజానికి ఉపయోగపడే భావి పౌరులుగా తయారవ్వాలన్నది తన ఆకాంక్ష అని పేర్కొన్నారు. ప్రస్తుతం విజయనగరం, హైదరాబాద్ ప్రాంతాల్లో వైద్య సేవలు అందిస్తున్నామని, ఇకపై నెలలో రెండు రోజులపాటు సొంత గ్రామమైన కవిటి ప్రాంత ప్రజలకు వైద్య సేవలు అందిస్తామని తెలిపారు.

జీవిత బీమాలో రికార్డు వృద్ధి.. యాక్సిస్ మ్యాక్స్ లైఫ్ వెల్లడి

విశాలాంధ్ర - విశాఖపట్నం : దేశంలోని జీవిత బీమా కలిగిన వారి శాతం రికార్డు స్థాయిలో 78 శాతానికి చేరిందని యాక్సిస్ మాక్స్ లైఫ్ ఇన్సూరెన్స్ లిమిటెడ్ (గతంలో మాక్స్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్), ప్రపంచంలోని ప్రముఖ మార్కెటింగ్ డేటా, విశ్లేషణ సంస్థ కాంతార భాగస్వామ్యంతో నిర్వహించిన సర్వేలో వెల్లడైందని యాక్సిస్ మాక్స్ లైఫ్ ఇన్సూరెన్స్ సీఈఓ, మేనేజింగ్ డైరెక్టర్ ప్రశాంత్ త్రిపాఠి తెలిపారు. ఇండియా ప్రొటెక్షన్ కోషెంట్ సర్వే (ఐపీక్యూ) ఏడవ ఎడిషన్ ఫలితాలు వెల్లడించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 25 భారతీయ నగరాల్లో 6,360 గృహాలను ఈ సర్వే కవర్ చేసిందన్నారు. భారతదేశం అభివృద్ధి చెందుతున్న ఆర్థిక, రక్షణ మనస్తత్వాన్ని హైలైట్ చేసే 'భరోసా టాక్స్' ఏకీకృత కథనం కింద ఇండియా ప్రొటెక్షన్ కోషెంట్ 7.0 ప్రారంభిస్తుందన్నారు. ఈ వేదిక ద్వారా గ్రామీణ, పట్టణ, జీతభత్యాలపై ఆధారపడిన వారు, రిటైర్డ్ వ్యక్తుల అభిప్రాయాలు వెలికి తీసి, దేశ ప్రజల రక్షణ, ప్రణాళిక, భవిష్య భద్రత పట్ల ఉన్న దృక్పథాన్ని వివరించేందుకు ఉద్దేశించిందన్నారు. పట్టణాలలో ప్రొటెక్షన్ కోషెంట్ 2019లో ఉన్న 35 నుంచి 2025లో 48కి చేరిందన్నారు. ఇది ఆర్థిక సన్నద్ధతలో అభివృద్ధిని సూచిస్తుందని తెలిపారు. జీవిత బీమా కలిగిన వారి శాతం అత్యధికంగా పెరిగిందన్నారు. ఇది ఇప్పటి వరకు కనిపించిన అత్యున్నత స్థాయి అన్నారు.